క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలి



హీరో ఎక్స్‌టెక్ వాహనం తాళాలను కొనుగోలుదారుకు అందిస్తున్న సీఐ ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హీరో మోటోకార్ప్ సంస్థ అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన హీరో సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ వాహనాన్ని స్థానిక సాయి స్వర్ణ మోటార్స్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు త్రీటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ వరప్రసాద్ నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ద్విచక్రవాహనాల వినియోగం గణనీయంగా పెరిగిందని, ముఖ్యంగా యువత తమకు నచ్చిన వాహనాలు వినియోగిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనంతో రహదారిపైకి వచ్చినప్పుడు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, తమ డ్రైవింగ్ ద్వారా ఇతరులకు హాని కలిగించరాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సాయిస్వర్ణ షోరూం సర్వీస్ మేనేజర్ ఐ. పవన్ కుమార్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ దిలీప్ రెడ్డి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వడగాడ్పుల నుంచి తగిన రక్షణ పొందాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ దిలీప్ రెడ్డి మొసాలి సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ శ్రీరామ్ నగర్ శాఖ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు తగిన ఆహారం, ద్రవం తీసుకుని రావాలని, మధ్యలో ఎక్కడైనా దాహం వేస్తే నిర్లక్ష్యం చేయకుండా మంచినీరు గానీ మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటి ద్రవపదార్థాలు సేవించాలని సూచించారు. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి టోపీలు గానీ గొడుగులు గానీ ధరించి బయటకు రావాలన్నారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వెంకట సత్యనారాయణ, శ్రీరామ్ నగర్ బ్రాంచ్ మేనేజర్ దీప్తి కాన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు వచ్చాయి

- రూ.1 కోటి 40 లక్షల 25 వేలు జమ..
- 2,456 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



చొదిమెళ్లలో రైతుతో మాట్లాడుతున్న నోడల్ అధికారి సోమశేఖర్



మల్కాపురం నుంచి ధాన్యం తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

ఏలూరు రూరల్ : ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ చేస్తోంది. ధాన్యం సేకరించిన రెండు వారాల్లోనే నగదు జమ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు మండలం వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం సేకరణ పూర్తి చేసిన వెంటనే, నగదు జమపై దృష్టి పెట్టారు. మొత్తంగా 199 మంది రైతులకు చెందిన 302 ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఓటర్స్ (ఎఫ్‌టీఓ) ఆన్‌లైన్ చేశారు. దీంతో ప్రభుత్వం నగదు చెల్లింపులు ప్రక్రియ చేపట్టింది.

199 మందికి రూ 4.48 కోట్లు నగదు

మండలంలో మల్కాపురం, చొదిమెళ్ల, వెంకటాపురం ,శనివారపుపేట తదితర గ్రామాల్లో 1207 ఎకరాల్లో వరి సాగు చేసిన 199 మంది రైతులకు ప్రభుత్వం రూ. 4 కోట్ల 48 లక్షల 85వేల 712లు నగదు అందించనుంది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే 95 (ఎఫ్‌టీఓ) రూ 1కోటి 40 లక్షల 25వేల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసింది. మరో 185 ఎఫ్‌టీఓ కల్గిన రైతులకు రూ. 2 కోట్ల 35 లక్షల 95 వేల రూపాయలను కొద్దిరోజుల్లో జమ చేయనున్నట్టు ప్రభుత్వం ఏపీ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో పేర్కొంది. మిగిలిన 22 ఎఫ్‌టీఓ గల రైతులకు రూ. 25 లక్షల 36వేల 400లు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయినట్లు వెల్లడించింది. మొత్తంగా నిర్దేశించిన సమయానికి ధాన్యం డబ్బు రైతుల ఖాతాల్లో జమ కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్కరకొచ్చిన ఈ క్రాప్ బుకింగ్ :

రైతు సంక్షేమ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి ఈ క్రాప్ బుకింగ్ పథకం సాగుదారులకు ఎంతో మేలు చేసింది. ఈ విధానం వల్ల అధికారులు ఆర్బీకే కేంద్రాల ద్వారా ధాన్యం త్వరితగతిన సేకరించి మిల్లర్లకు తరలించారు. దీనికి ముందే 3 వేల గోనె సంచులు అందజేశారు. మరోపక్క జిల్లా కలెక్టర్ తహసీల్దార్‌ను నోడల్ అధికారిగా నియమించి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి 1207 ఎకరాల్లో సాగుచేసిన 2456 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ విజయవంతం చేశారు.

ప్రభుత్వం నా డబ్బు జమ చేసింది



ప్రభుత్వం నా ధాన్యం డబ్బు జమ చేసింది. నాకు రావాల్సిన రూ 3 లక్షల 11 వేల 712లను బ్యాంక్ ఖాతాలో వేసింది. చాలా సంతోషంగా ఉంది. ఇంత వేగంగా డబ్బు జమ అవుతాయని అనుకోలేదు. కష్టానికి తగిన ఫలితంగా దక్కిందన్న సంతోషం కల్గింది. ఇదే క్రమంలో ఏటా కష్టపడి సాగు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను.

– తలారి జయరాజు, వెంకటాపురం

అధికారులు ఆదుకున్నారు



ప్రకృతిని ఎవ్వరూ జయించలేరు. వర్షాలు, వరదల వల్ల రైతు నష్టపోయే పరిస్థితి వచ్చినప్పుడు అధికారులు ఇలాగే సహకారం అందిస్తే ప్రతి రైతు సంతోషిస్తాడు. అకాల వర్షం వల్ల నా పంట తడిచిపోయే పరిస్థితి వచ్చింది. కాని అధికారులు ధాన్యం పాడవకుండా సహకారం అందించారు. నేడు ముందుచూపుగా ధాన్యాన్ని మిల్లుకు తరలించి గట్టెక్కాను.

– యర్లపల్లి రమేష్, తంగెళ్లమూడి

సకాలంలో స్పందించారు



ప్రభుత్వం సకాలంలో స్పందించింది. నేను 19.72 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుకు తరలించాను. దీనికి సంబంధించి మొత్తంగా 4 లక్షల 2,288 రూపాయలు నా ఖాతాలో వేసింది. ఈ ఏడాది రబీలో కష్టపడి సాగు చేసిన కష్టాన్ని అకాల వర్షాలు ఎత్తుకుపోతాయని భయపడ్డాను. కాని ప్రభుత్వం ఆదుకుంది. ధాన్యం తడిచిపోకుండా సహకరించారు. ముందుగానే గోనె సంచులు సరఫరా చేశారు. పంటను మిల్లులకు తరలించేందుకు సహకరించారు.

– గడిని లక్ష్మి, శనివారపుపేట

ప్రభుత్వం ధాన్యం డబ్బు చెల్లిస్తోంది



ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. ఇప్పటికే 90 మందికి పైగా రైతులకు నగదు జమ అయ్యింది. ధాన్యం అమ్మిన వెంటనే రైతుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఇప్పటికే కొంత మంది రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ అవుతోంది. కొద్దిరోజుల్లో మొత్తంగా 199 మంది రైతులు రూ. 4 కోట్ల 48 లక్షల 85వేల 712లు అందుకుంటారు.

ఎ జీవనసంధ్య, ఎంఏఓ

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సరళకుమారికి వినతి పత్రం అందజేస్తున్న నాగశేషు

ఏలూరు రూరల్: మండలం జాలిపూడి పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కోడి చుక్కల నాగశేషు కోరారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారిని కలిశారు. గత సోమవారం జిల్లా కలెక్టర్ వి ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశానన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు. బ్లీచింగ్, వీధిలైట్లు కొనుగోలు, డ్రైయినేజీ, పారిశుధ్యం తదితర పనుల పేరుతో సర్పంచ్ వీధి నవ్య పంచాయతీ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు భర్త అకౌంట్‌కు మరలించారని వివరించారు. పంచాయతీలో తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టినప్పటికీ బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. పంచాయతీ పాలన వ్యవహారం గూర్చి ప్రజలకు తెలియజేసేందుకు 2017 నుంచి నేటి వరకూ పంచాయతీ నిధులు ఖర్చు, అభివృద్ధి పనులు మొత్తం సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అందించాలని కోరారు.

మహేశ్వరపురంలో బోరు పనులు ప్రారంభం

ఏలూరు రూరల్ : గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఏలూరు మండలపరిషత్ నిధులు 4.50 లక్షల రూపాయలతో మహేశ్వరపురంలో బోరు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదూరు ప్రాంతాలకు సైతం తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, తేరా ఆనంద్, మండల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షుడిగా లక్ష్మణరావు



ఏలూరు సెంట్రల్ మండల అధ్యక్షునిగా నియమితులైన లక్ష్మణరావును అభినందిస్తున్న పార్టీ నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు సెంట్రల్ మండల బీజేపీ అధ్యక్షునిగా బర్మా లక్ష్మణరావును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొరళ్ళ సుధాకర్ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కొరళ్ళ సుధాకర్ కృష్ణ మాట్లాడుతూ బీజేపీ ఏలూరు సెంట్రల్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లక్ష్మణరావును తాజాగా అధ్యక్షునిగా నియమించడం జరిగిందన్నారు. బర్మా లక్ష్మణరావు మాట్లాడుతూ తన శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి, నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ బీజెపి కన్వీనర్ గాది రాంబాబు, కో-కన్వీనర్ బాడిత నారాయణ రావు, మైనార్టీ నాయకులు షేక్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 4వ రోజు ఉత్సావాలు పురస్కరించుకుని లిల్లీ పూలతో ప్రత్యేక పూజలు చేశారు. అప్పనవీడు గ్రామానికి చెందిన పాటోలు సుధాకర్ దంపతులు, తవ్వా రవితేజ దందపలు ఈ పూజల్లో పాల్గొని స్వామికి సహస్త్ర నామార్చనలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 6గంటలకు గరికపాటి నర్సింహరావు ప్రవచనం ఏర్పాటు చేశారు. భక్తుల సందర్శన కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

‘ఉపాధి’ చట్టానికి ప్రమాదమొచ్చింది



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): కోట్లాది మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకుంటే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఉపాధి హామీలో రెండు పూటల పని విధానం వల్ల కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడుతూ బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో రూ.30వేల కోట్లు నిధులు తగ్గించి ఉపాధి హామీ పథకం పీక నొక్కిందన్నారు. అంటే ఏడాదికి 22 పనిదినాలు మాత్రమే కల్పించే అవకాశం ఉంటుందన్నారు. దీన్ని బట్టి బీజేపీకి పేదల పట్ల ఎంలాంటి వైఖరితో ఉందో అర్థమవుతుందన్నారు. కుటుంబానికి 200 పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్టర్లను నిషేధించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ రక్షణకై జిల్లాలో చేపట్టనున్న యాత్రను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మహంకాళి, టి.సత్యనారాయణ, డి.దాసు, సిహెచ్ మాధవ, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల వ్యాఖ్యలపై నిరసన



ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతుగా నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మహిళా రెజ్లర్లపై భాజపా ఎంపీ చేసిన వ్యాఖ్యలు, లైంగిక వేధింపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు డిమాండ్ చేశారు. రెజ్లర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కొత్రి విజయలక్ష్మి మాట్లాడుతూ రక్షణ కల్పించాల్సిన పోలీసులు వారిపై దాడి చేయడం దారుణమన్నారు. తక్షణమే బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి, అతని ఎంపీ పదవిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భాజపా వచ్చాక దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా యోధులకు దేశ ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష,కార్యదర్శులు బి.జగన్నాధం, వి.సాయిబాబు, కోటేశ్వరరావు,శేఖర్, గడ్డి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ బిల్లులు సకాలంలో విడుదల చేయాలి



మాట్లాడుతున్న హమాలీల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఉదయ భాస్కర్

ఏలూరు (టూటౌన్) : ఏలూరు జిల్లాలో సివిల్ సప్లై హమాలీలకు హమాలీ బిల్లులు సకాలంలో విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదయ్ భాస్కరరావు డిమాండ్ చేశారు. స్థానిక అల్లూరి సత్యనారాయణ భవనంలో యూనియన్ జిల్లా సమావేశం గడ్డి సూర్యారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ సరుకులను వారం రోజుల్లో ఎగుమతులు, దిగుమతులు చేయలని ఒత్తిడి చేస్తుందన్నారు. నెలంతా కష్టపడి పనిచేస్తే సకాలంలో బిల్లులు ఇవ్వకుంటే కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించేకుంటరన్నారు. ఈఎస్ఐ సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని ప్రభుత్వం కోర్టులో జోక్యం చేసుకుని తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజులు మాట్లాడుతూ హమాలీలను సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.శేఖర్, కార్యదర్శిగా గడ్డి సూర్యారావు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, అబ్బులు, సహాయ కార్యదర్శిగా కొర్ర కిషోర్, కోశాధికారిగా ఎస్ రాంబాబు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా డీఎంకు వినతి పత్రం అందజేసారు.

దోమలతోనే అంటువ్యాధుల వ్యాప్తి

గణపవరం: డెంగీతో పాటు అనేక రకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమలేనని, వాటి నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. గణపవరం పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో ప్రజలకు ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అవసరం, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించడం వల్ల దోమల వ్యాప్తిని చాలావరకు అరికట్టవచ్చునన్నారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల వద్ద వాడుకలో లేని పాత్రలు, టైర్లు, పాత ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ ఉన్న నీటిలో పెరుగుతున్న దోమల లార్వాను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి, రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, పీహెచ్‌ఎస్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



భీమడోలులో చిన్నారులకు యోగాసనాలు నేర్పుతున్న ఆరా ఫౌండేషన్ నిర్వాహకులు

భీమడోలు: యోగా ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఆరా ఫౌండేషన్ అధినేత భవనారుషి అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఐదో రోజైన శుక్రవారం కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులకు కథలు చెప్పడం, వినడం, యోగాసనాలు, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాలపై చిన్నారులకు తర్ఫీదును అందించారు. యోగా ట్రైనర్ భావన రుషి యోగాసనాల ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, సత్యేంద్ర చిన్నారులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, సిబ్బంది, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి

గణపవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 8 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, డేటా ఆపరేటర్ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం శివకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు.. అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పెదవేగి : మండలంలో విధులు నిర్వహించే సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలని పెదవేగి జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. బుధవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించారు. పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారిణి ముత్యాల ప్రియాంక మాట్లాడుతూ వ్యవసాయశాఖ యాంత్రీకరణలో భాగంగా వచ్చిన వివిధ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ బాబు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మిగతా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో రైతులకు, ప్రజలకు, వివిధ వర్గాల ప్రజలకు సబ్సిడీపై ఇచ్చేవాటిని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అర్హులకు పథకాలు చేరేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి రాజ్‌మనోజ్, తహసీల్దార్ ఎన్. నాగరాజు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసారు. స్వామి వారికి క్షీరాభిషేక పూజలు చేసారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	70
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	34
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	40	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	08-12
దొండకాయలు	24	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	14
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	30